క్లుప్తంగా

పాంబండ ఉత్సవాలకు రండి


ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ ఈఓ సుధాకర్, అర్చకుడు

కుల్కచర్ల: శ్రావణమాస ముగింపును పురస్కరించుకుని పాంబండ దేవస్థానంలో నిర్వహించే ఉత్సవాలకు హాజరుకావాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి ఆలయ కమిటీ ఈఓ సుధాకర్ ఆహ్వానం అందజేశారు. శనివారం ఎమ్మెల్యే నివాసంలో కలిసి అభిషేకించిన పూలమాలతో సన్మానించారు. సోమవారం జరగనున్న చిన్నజాతరకు రావాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉత్సవాల్లో తప్పనిసరిగా పాల్గొంటామన్నారు. పాంబండ ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. వారితో పాటు ఆలయ అర్చకులు పాండుశర్మ ఉన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



యాలాల: మండలానికి కొత్తగా వచ్చిన తహసీల్దార్ అంజయ్యను గిరిజాపూర్ కాంగ్రెస్ నేత లక్ష్మయ్య ముదిరాజ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సన్మానించారు. భూసమస్యల పరిష్కారం, మండల ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు.

మొక్కలు నాటే పనుల పరిశీలన


పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల

అనంతగిరి: వికారాబాద్‌లోని ఎన్టీఆర్ చౌరస్తా ప్రధాన కూడలి నుంచి ఎన్నెపల్లి చౌరస్తా వరకు శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల పర్యవేక్షించారు. గతంలో ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ఎన్నెపల్లి చౌరస్తా వరకు రోడ్డు డివైడర్‌లో పెట్టిన కోనో కార్పస్ మొక్కలను ప్రజారోగ్యం దృష్ట్యా తొలగించామని, వాటిస్థానంలో ఫాక్స్‌టైల్, డ్రాకేనా మొక్కలు నాటినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ జాకీర్ అహ్మద్, శానిటేషన్ ఇన్‌చార్జి ఎస్‌ఐ యేసు, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బోధనోపకరణాలు ఉపయోగించాలి


కాంప్లెక్స్ సమావేశంలో ఆర్పీలు

బొంరాస్‌పేట: విద్యాబోధనలో బోధనోపకరణాలు ఉపయోగించాలని ఆర్పీలు శ్రీప్రియ, నవీన్‌కుమార్, జీవన్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం రెండో రోజు మండలంలోని బొంరాస్‌పేట, చౌదర్‌పల్లి కాంప్లెక్స్ పరిధిలో సమావేశాలు నిర్వహించారు. టీఎల్‌ఎం, మెలకువలు పాటించి బోధిస్తే విద్యార్థుల్లోని ప్రతిభ, సామర్థ్యాలు బయటికి వస్తాయని ఆర్పీలు వివరించారు. ఉపాధ్యాయులకు హరివిల్లు, మాస్ పరీక్షల తదితర బోధనాంశాలపై అవగాహన కల్పించారు. సీఆర్పీలు సోమ్లా, శంకరయ్య, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు సీపీఎస్ సాధనకు ర్యాలీ


సమావేశంలో ఉద్యోగ సంఘాల నాయకులు

అనంతగిరి: సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆదివారం వికారాబాద్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి అజ్మత్ పాషా తెలిపారు. ఈ మేరకు శనివారం వికారాబాద్‌లోని టీఎన్జీఓ కార్యాలయంలో ఉద్యోగ సంఘాల జేఏసీతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. ఉ.10.30 గంటలకు టీఎన్జీవో భవన్ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు.


అనంతగిరి: అలుగు పారిన శివాసాగర్ చెరువు


అనంతగిరి: నీట మునిగిన పత్తి పంట


నవాబుపేట: పారుతున్న మూసీనది

వానలే వానలు

బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఏకధాటిగా పడుతున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంటలు నీటమునిగాయి. రోడ్లపై వర్షం నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.


కొడంగల్ : ఉధృతంగా ప్రవహిస్తున్న అంగడిరాయిచూర్ వాగు


కుల్కచర్ల: మత్తడిదూకుతున్న గండిచెరువు


అనంతగిరి: గిరిగేట్ పల్లి రైల్వే బ్రిడ్జి కింద పారుతున్న వరద


తాండూరు రూరల్: బెల్కటూర్ వాగుపై నుంచి ప్రవహిస్తున్న వర్షం నీరు


పరిగి: సాయిరాంనగర్ కాలనీలో పారుతున్న వరద నీరు


పరిగి: ఉధృతంగా ప్రవహిస్తున్న పరిగి వాగు


కొడంగల్ : కాలువలో చేపలు పడుతున్న యువకులు

శిథిలావస్థలో పాఠశాల


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

యాలాల: మండల కేంద్రంలోని హరిజనవాడ పాఠశాలపై అధికారులు చిన్నచూపు వీడాలని కేవీపీఎస్ జిల్లా నాయకుడు ఉప్పలి మల్కయ్య ఆరోపించారు. శనివారం ఈ విషయమై తహసీల్దార్ అంజయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మల్కయ్య మాట్లాడుతూ.. హరిజనవాడలో ఉన్న పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందన్నారు. పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులు ఉండగా, కనీస వసతులు లేవన్నారు. మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేయడానికి కిచెన్ షెడ్డు కూడా అసంపూర్తిగా ఉందన్నారు. పాఠశాల ఆవరణలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పాఠశాలలో అదనపు తరగతితో పాటు ప్రహరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ వార్డు సభ్యుడు యాదప్ప, బాబు, రాజు, రమేశ్, మహేశ్, రాములు, రమేశ్ తదితరులు ఉన్నారు.

రుణమాఫీ కోసమే నిర్ధారణ సర్వే

ఏఈఓ రుద్రమూర్తి


పెద్దేముల్: రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న అధికారులు

పెద్దేముల్: రుణమాఫీ కాని రైతుల కోసం గ్రామాల్లో కుటుంబ నిర్ధారణ సర్వే చేస్తున్నామని ఏడీఏ రుద్రమూర్తి అన్నారు. శనివారం పెద్దేముల్ మండల ఇందూరు గ్రామంలో రూ.రెండు లక్షలలోపు రుణమాఫీ కాని రైతుల కుటుంబాల వద్దకు వెళ్లి నిర్ధారణ సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. రుణమాఫీ కాని వారి జాబితాను ప్రభుత్వం అందచేసిందని, దాని ప్రకారం గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. రూ.2లక్షలకు పైగా ఉన్న రైతుల సంగతేమి ఏమిటని అని ప్రశ్నించగా, అది కూడా త్వరలో ప్రభుత్వం ప్రకటిస్తుందని వివరించారు. సెప్టెంబర్ 8వ తేదీ వరకు మండలంలో సర్వే చేయనున్నారు. అధికారులు వచ్చిన సమయంలో రైతులు అందుబాటులో లేకుంటే ఇతర గ్రామాలకు వెళ్లి సర్వేను పూర్తి చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓలు వినయ్, శివరాథ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

రైతుల వివరాల నమోదు

దుద్యాల్ : రుణమాఫీ కాని రైతుల వివరాలను వ్యవసాయ అధికారులు ఇంటింటికి వెళ్లి సేకరిస్తున్నారు. శనివారం దుద్యాల్ ఏఈఓ శైలజ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రుణాలు మాఫీ కానీ దుద్యాల, అల్లిఖాన్‌పల్లి, వాల్యానాయక్ తండా, సోమ్లు నాయక్‌తండాలకు చెందిన రైతుల వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ఖాజా, కాంగ్రెస్ జిల్లా సెక్రటరీ మెరుగు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మంచి సేవలకు గుర్తింపు

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


పరిగి: ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఎమ్మెల్యే

పరిగి: మంచిగా విధులు నిర్వహిస్తే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగి ఎంపీడీఓ ప్రభాకర్‌రెడ్డి పదవి విరమణ సందర్భంగా శనివారం వీడ్కోలు సమా వేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మె ల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగి ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండి ఎన్నో సేవలను అందిస్తారన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలంటే ప్రభుత్వ ఉద్యోగి సహకారం ఎంతో అవసరమన్నారు. ప్రజలకు మంచి సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సేవలు గుర్తుండిపోతాయి..

అనంతగిరి: విధి నిర్వహణలో మనం చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. ఈ మేరకు పదవి విరమణ పొందిన ఎస్సై యాదయ్య, ఏఎస్‌ఐ యాకూబ్ అలీలను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగం ఎంతో గౌరవ ప్రధానమైందన్నారు. పదవి విరమణ పొందిన ఇద్దరు ఆయురారోగ్యాలతో కుటుంబంతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. సమావేశంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తహసీల్దార్ తారాసింగ్


ఎస్‌ఐ విఠల్‌రెడ్డి

తాండూరు రూరల్: భారీ వర్షాల కారణంగా మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాండూరు మండల తహసీల్దార్ తారాసింగ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని కోరారు. పాత ఇళ్లల్లో నివాసముంటున్న వారు సురక్షిత ప్రాంతంలో ఉండాలన్నారు. అత్యవసరమైతే తహసీల్దార్ కార్యాలయ నంబర్ 9949084343కు ఫోన్ చేయాలని సూచించారు.

వాగులు దాటొద్దు

తాండూరు రూరల్: రాబోయే రెండు రోజులు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను ప్రజలు దాటొద్దని సూచించారు. అత్యవసరమయితే 100కు ఫోన్ చేయాలని, వాగుల వద్ద పోలీసులు అందుబాటులో ఉంటారని చెప్పారు.

అంటరానితనాన్ని రూపుమాపాలి

మర్పల్లి ఎస్‌ఐ సురేశ్

మర్పల్లి: సమాజంలో అంటరానితనాన్ని పూర్తిగా రూపుమాపాలని మర్పల్లి ఎస్‌ఐ సురేశ్ అన్నారు. శనివారం మండలంలోని కల్‌ఖోడ గ్రామంలో ఎస్సీ బాలికల వసతి గృహం వార్డెన్ తుల్జారామ్‌గౌడ్‌తో కలిసి పౌరహక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సమాజంలో ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి జీవించాలన్నారు. ఛాయ్ హోటల్‌ల్లో రెండు గ్లాసుల పద్ధతి వీడనాడాలని చెప్పారు. శరవేగంగా వృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు తమకు నచ్చని రంగాల్లో రాణించాలన్నారు. గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలను సద్వినియోగం చేసుకొని పిల్లలను చక్కగా చదివించుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ఆడపిల్లలకు బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలోఆర్‌ఐ మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి చందు, అంగన్‌వాడీ, ఆశకార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

శనిత్రయోదశి ప్రత్యేక పూజలు


దుద్యాల్: నవగ్రహాల పూజలో పాల్గొన్న భక్తులు


కుల్కచర్ల: పాండవులగుట్టపై వరదపాశం పోసిన గ్రామస్తులు

దుద్యాల్: శ్రావణమాసం చివరి శనివారం, శనిత్రయోదశి కావడంతో భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సంవత్సరకాలంలో రెండుసార్లు మాత్రమే శనివారం శని త్రయోదశి వస్తుందని పండితులు చెబుతున్నారు. ఈ అరుదైన రోజు కలిసి రావడంతో దేవాలయాలు భక్తులతో నిండుకున్నాయి. మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలోని కాశీ విశ్వనాథుడి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శనిశ్వరుడికి నల్ల నువ్వులు, నువ్వుల నూనెతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

పాండవులగుట్టపై వరదపాశం

కుల్కచర్ల: శనిత్రయోదశిని పురస్కరించుకుని మండలంలోని తిర్మలాపూర్ గ్రామ పరిధిలోని పాండవుల గుట్టపై గ్రామస్తులు వరదపాశంపోశారు. ప్రతి సంవత్సరం శనిత్రయోదశి సందర్భంగా శ్రావణమాసంలో వరదపాశాన్ని పోయడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుంది. తమ కుటుంబాలు సల్లంగా ఉండాలని, పాడిపంటలు సంవృద్ధిగా పండాలని గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఉత్సవాలకు వేళాయె


సప్తకొలనులో ఏకాంబరి రామలింగేశ్వర ఆలయం


పాంబండ రామలింగేశ్వర దేవస్థానం

జిల్లాలో నాలుగు రోజుల పాటు ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. పలు ప్రాంతాల్లో శ్రావణమాస ముగింపు జాతర ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయాల కమిటీ సభ్యులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో ఆయా దేవాలయాల్లో అభిషేకాలు, పూజలు, ఊరేగింపులతో భక్తుల సందడి చేయనున్నారు.

- జిల్లాకు ఆధ్యాత్మిక శోభ
- శ్రావణమాస ముగింపు ఉత్సవాలకు ఆలయాలు సిద్ధం
- నేటి నుంచి రామలింగేశ్వర జాతర
- బందోబస్తు ఏర్పాట్లు పరిశీలిస్తున్న పోలీసులు

బషీరాబాద్: జిల్లా సరిహద్దులో దట్టమైన అటవీ ప్రాంతంలోని సప్త కొలనుల మధ్య వెలసిన నీళ్లపల్లి ఏకాంబర రామలింగేశ్వర జాతర ఉత్సవాలు నేటి (ఆదివారం) నుంచి ప్రారంభకానున్నాయి. ఈ మేరకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇక్కడి సప్త కొలనులో స్నానం ఆచరించి స్వామివారిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. బషీరాబాద్ మండలం నీళ్లపల్లి అటవీ ప్రాంతంలో గల ఏకాంబరి రామలింగేశ్వరస్వామి ఆలయం ప్రతీ శ్రావణ మాసం చివరి సోమవారం నాడు జాతర ఉత్సవాలు జరుగుతాయి. అతి పురాతన చారిత్రక ప్రాధాన్యత, విశిష్టతలను సంతరించుకుంది. ఈ జాతర ఉత్సవాలకు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు గ్రామాల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. ఎక్కువగా తాండూరు, వికారాబాద్, మహబూబ్‌నగర్, సేడం పట్టణాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. పవిత్ర శ్రావణ మాసంలో వచ్చే ఈ జాతర ఉత్సవాలు నేటి నుంచినాలుగు రోజుల పాటు కొనసాగుతాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

పాంబండ చిన్నజాతర సిద్ధం

కుల్కచర్ల: కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా పాంబండ దేవస్థానం ప్రసిద్ధి చెందింది. త్రేతాయుగం నాటి చరిత్ర కలిగిన ప్రాచీన దేవాలయంగా పాంబండ దేవస్థానానికి ప్రాధాన్యం ఉంది. కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో ఉన్న పాంబండ రామలింగేశ్వర స్థానం మహిమగల ఆలయంగా కీర్తి ప్రతిష్ఠలను పొందింది. స్వయంగా శ్రీరాముడే శివలింగాన్ని ప్రతిష్ఠించినట్లుగా చరిత్ర చెబుతోంది. ప్రతీ సంవత్సరం రెండు సందర్భాల్లో ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని 11రోజుల పాటుగా పెద్ద జాతర, శ్రావణముగింపు సందర్భంగా 2రోజులు చిన్న జాతరలను నిర్వహిస్తారు. అందులో భాగంగా 2, 3వ తేదీల్లో చిన్నజాతరను నిర్వహించేందుకు పాలకవర్గం అన్ని ఏర్పాట్లను చేస్తోంది. 2న సోమవారం ఉదయం అభిషేకం, సాయంత్రం శకటోత్సవం, పల్లకీసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 3వ తేదీ భక్తులకు సర్వదర్శనం కల్పిస్తారు.

అంబురామేశ్వర జాతరకు ఏర్పాట్లు పూర్తి

పెద్దేముల్: భక్తుల కోరికలు తీర్చే అంబురామేశ్వర జాతరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు పూర్తి చేశారు. రేపు(సోమవారం) శ్రావణమాసం చివరి సోమవారం జాతర అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర నుంచి ప్రజలు తరలివస్తారు. దీంతో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. పెద్దేముల్ మండల తట్టెపల్లి గ్రామ శివారుల్లో ఉన్న అంబురామేశ్వర ఆలయంలో భక్తులు శ్రావణ మాసంలో నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తారు. తట్టెపల్లి, పాషాపూర్, ఆత్కూర్‌తండా గ్రామాల మధ్య, చుట్టూ పక్కల దట్టమైన అడవి ప్రాంతంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో అంబురామేశ్వర స్వామి వెలిశారు. ఈ జాతరకు మండలంతో పాటు వికారాబాద్, హైదరాబాద్ జహీరాబాద్, తాండూరు, కొడంగల్ ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో వస్తారు. ఆదివారం సాయంత్రం స్వామివారిని పల్లకీ సేవతో తట్టెపల్లి నుంచి అంబురామేశ్వ దేవాలయం వరకు భజనతో తీసుకొచ్చి మళ్లీ సోమవారం రాత్రికి పల్లకీ సేవల్లో తట్టెపల్లి గ్రామానికి తరలిస్తారు.


అంబురామేశ్వర దేవాలయం

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
వెంకటరమణ-9912220528
Md. జకీర్-9573005622